## అందరికోసం.. ఆవిష్కరణలు

# 2023

## 1 స్మార్ట్‌లుక్ ఇ-బైక్

**ప్రముఖ** ఎలక్ట్రానిక్స్ కంపెనీ ఏసర్ 'ఈబీఐ' పేరుతో మొట్టమొదటి ఎలక్ట్రిక్ సైకిల్‌ను అభివృద్ధి చేసింది. ఈ రెండు చక్రాల బండి ప్రత్యేకతలు అనేకం. మనం ఎక్కడైనా నిలిపి వెళ్తే దానంతట అదే లాక్ చేసుకుంటుంది. ఒక వేళ దొంగతనం జరిగినా.. దీనికి అనుసంధానంగా ఉండే జీపీఎస్ వ్యవస్థ ఇట్టే పట్టేస్తుంది. సైకిల్ ఎక్కడుందో తెలుసుకోవడం చిటికెలో పని. గ్రీజుతో కూడిన చైన్‌కు బదులుగా కార్బన్ బెల్ట్ వాడారు. దీని బ్యాటరీ స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్ చార్జర్‌గానూ పనికొస్తుంది. ప్రత్యేకంగా అమర్చిన సెన్సర్లు మనం పెడల్ తొక్కే బలాన్ని, వెళ్తున్న ప్రాంతం ఎత్తును అర్థం చేసుకుంటాయి. సాఫీగా సాగిపోవడానికి దానంతట అదే శక్తిని సర్దుబాటు చేసుకుంటుంది. గేర్లు లేకపోవడం ఓ ప్రత్యేకత.




## 2 అమ్మకడుపు చల్లగా..



**వైద్యపరమైన,** నైతికమైన పరిమితుల కారణంగా.. తల్లి గర్భంలో పిండం రూపొందుతున్న తొలివారాల్లో దాని అభివృద్ధి క్రమం గురించి కచ్చితంగా తెలుసుకోలేం. ఈ సవాలును అధిగమించడానికి.. ఇజ్రాయెల్‌కు చెందిన వైజ్‌మన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ జీవశాస్త్రవేత్త జాకబ్ హన్నా బృందం.. పిండం తొలిదశకు సంబంధించిన నైవ్ మూలకణాలను సేకరించి వాటిని ప్రత్యేకమైన రసాయనాలతో శుద్ధిచేసింది. వాటిని పిండాల్లో కనిపించే నాలుగు రకాల కణాలుగా మార్చింది. వీటిలో ఒక కణం వెంటనే మానవ పిండంగా రూపాన్ని సంతరించుకుందట. దాన్ని పరిశోధకులు 14 రోజులపాటు ఎదిగేందుకు వీలు కల్పించారు. ఈ ప్రక్రియ సంతాన సఫలత, గర్భం నిలవకపోవడం తదితర విషయాల గురించి తగినంత సమాచారం ఇచ్చిందట. ఇలాంటి పరిశోధన చేయడం ఇదే మొదటిసారి.

## 3 డ్యాన్సింగ్ లైట్స్




**గృహాలంకరణలో** ఎల్ఈడీ పట్టీ లైట్లు విడదీయరాని భాగమైపోయాయి. కానీ జనరల్ ఎలక్ట్రిక్ (జీఈ) రూపొందించిన సింక్ డైనమిక్ ఎఫెక్ట్స్ నియాన్ షేప్ స్మార్ట్ లైట్లు మాత్రం వీటికి భిన్నమైనవి. ఈ నియాన్ రోప్ లైట్లలో మైక్రోఫోన్లు అమర్చారు. దీంతో సంగీతానికి అనుగుణంగా ఈ లైట్లు స్పందిస్తాయి. దీనివల్ల లైట్ షో.. మరింత సందడిగా మారుతుంది. గదుల అలంకరణలో జీవం ఉట్టిపడుతుంది.